# సృష్టిలో లేనిది

( స్త్రీ పాత్ర లేని నాటిక )

- శంకరమంచి పార్థ సారథి

## కేరెక్టర్లు

1. చిరంజీవి
2. గోవిందు
3. లక్ష్మీపతి
4. సింహాచలం

# సృష్టిలో తీయనిది

( స్త్రీ పాత్ర లేని నాటిక )

- శంకరమంచి పార్థ సారథి

( తెర తొలిగేసరికి – 2 సూట్ కేసులు, 2 చాపలు, 2 కుర్చీలు, 1 టేబుల్‌తో అదొక బ్రహ్మాచారుల గది, హేంగర్స్‌కి మాసిన బట్టలు, టేబిలుపైన చిందర వందరగా పుస్తకాలు, గోడలికి సినిమాతారల క్యాలండర్సు, ఒకే ఒక దేవుడి ఫోటో వ్రేలాడుడుతుంటాయ్

చిరంజీవి టేబిలుముందు కూర్చుని సీరియస్‌గా డైరీ వ్రాసుకుంటాడు. మధ్యలో తలెత్తి తనలో తానే నవ్వుకుని, తిరిగి వ్రాస్తుంటాడు.

అంతలో గోవిందు లోపల్నించి స్టేజీపై కొచ్చేడు. చాలా ఆదుర్దాగా వున్నాడు )

గోవిందు : ఒరే జీవి....జీవి...నా సిల్కు కర్ఛీఫ్‌ని చూసేవా ?

( అంటూనే గది నాలుగువైపులా కంగారుగా వెతుకుతుంటాడు. వెతకటం పూర్తిచేసి స్నేహితుడి ధోరణిలో మార్పు కన్పించకపోయేసరికి, కోపంగా )

నిన్నేరా ఏ లోకంలో వున్నావ్ ? ఫ్రెండునే, రూమ్‌మేటునే నాకింత కష్టం వస్తే ఏం పట్టనట్లు అలా కూర్చుండిపోతావా ?

( అంటూ జీవి భుజం తట్టేడు. అతడు తృళ్ళిపడి )

జీవి : విందూ – పిల్చేవా ?

గోవిందు : ( వ్యంగ్యంగా ) అబ్బే, నే పిలవందే – నీ ఆలాపన – అదేనోయ్ ! పథ్యం తిండి తింటూన్న వాడిలా వెధవ పరధ్యాన్నం నువ్వూను !

జీవి : అంతకోపం దేనికి రా విందూ

గోవిందు : కాకపోతే ఏవిట్రా – నా సిల్కు కర్ఛీఫ్ పోయి నేను ఏడుస్తుంటే నీ కేవన్నా చీమ కుట్టినట్టన్నా వుందా. వూహూ, నీ ప్రపంచం నీ డైరీ, నీ పరధ్యాన్నం ....

ఛీ ఛీ కష్టంలో కాకపోతే ఇంకెందుకురా ఫ్రెండనేవాడు.

జీవి : అవున్రా సిల్కు కర్ఛీఫ్‌కదూ పోయిందన్నావ్ –

విందు : అయితే మాత్రం. అదంత తేలికైన విషయంలా కనిపిస్తోందా ?

జీవి : కాదా – అయిదు రూపాయలు పారేస్తే ఇంకోటి కొనుక్కోవచ్చు ఎవరన్నా నీ హడావిడి చూస్తే పోయింది చేతిగుడ్డనుకోరు – కట్టు బట్టలనుకుంటారు సుమా – జాగ్రత్త

విందు : ఓహో అలాగా – అయామ్ సారీ రా – నా కళ్ళు తెరిపించావ్ –ఏవిటో వెధవకంగారు నేనున్నూ –

( అంటూనే జీవి చూడకుండా టేబిలుపై డైరీని కనిపించకుండా దాచేడు )

అయిదు రూపాయలిస్తే ఇంకో ఖర్చీఫ్ కొనుక్కోవచ్చు గదూ – ఛ ఆ విషయం తట్టనే లేదు. మట్టి బుఱ్ఱ

జీవి : ( అంతలో టేబిలువైపు తిరిగి కంగారుగా )

అరే – నా డైరీ ఏది ఇప్పుడిక్కడే వుండాలే. ఒరే విందూ – నా డైరీగాని చూసేవా – ఇప్పటిదాకా ఇక్కడే వుండాలి.

విందు : ఏవిటి నీ డైరీ కూడా పోయిందా – ఈ కొంపలో ఏ దయ్యమో భూతమో వుండుండాలి – కాకపోతే ముందు నా కర్చీఫ్ ఇప్పుడు నీ డైరీ....

( జీవి గదంతా వెతికేస్తున్నాడు – ఆదుర్దాగా – అది చూసి ) పోన్లే పోతే పోయింది. ఏం చేస్తాం వున్నవే మనవి – అయినా పోయింది డైరీయే కదరా ..... ఎందుకింత కంగారు పదిరూపాయిలు పారేస్తే ఇంకోటి – కొనుక్కోవచ్చు – ఏవంటావ్ ?

జీవి : నోరు మూయమంటా – ఆ డైరీ విలువని మాటల్లోచెప్పలేను. చెప్పినా నీ కర్ధమయి చావదు.

విందు : అవునవును.

జీవి : అది డైరీ కాదు – నా జీవితం. నా అంతరంగ మధనం – నా ప్రేమ కధనం – అది ...అది ...ఛ నీకర్ధం కాదులే.

విందు : మైడియర్ జీవి –అలాగే పోయిన నా సిల్కు కర్చీఫ్ వెనకాల కూడా అత్తర వాసనల్లాంటి అనుభవాలుండొచ్చుగా ?

( అంటూనే డైరీని జీవి కందించాడు. అతడు దాన్నందుకుని ఆప్యాయంగా దాని వంక చూసుకుని గుండెలకి హత్తుకుని )

జీవి : అబ్బ కాస్సేపట్లో ఎంత కంగారు పెట్టేవురా – థాంక్స్‌రా –అయామ్ సారీరా.

విందు : ఆ థాంక్సేవిటి – వెనకాలె సారీ ఏవిటి – వెనకటికి వాడెవడో – నా

పెళ్ళయిందండి అంటే సారీ అన్నాట్ట – నీకదేం రోగం – బుద్ధి లేదా – యూస్లెస్ ఫెలో అంటే థాంక్స్ అన్నట్టు – అలా వుంది నీ వ్యవహారం.

జీవి : నా డైరీ నాకిచ్చినందుకు థాంక్స్ – నీ ప్రియురాలు నీ కిచ్చిన ఆ సిల్కు కర్చీఫ్ పోయిందని నువు బాధపడుతుంటే తెలీక తేలిగ్గా వాగేసినందుకు సారీ....

( గోవిందు పెద్దగా నవ్వాడు ) ఎందుకురా అలా నవ్వుతున్నావ్.

వింద్ : కాకపోతే ఒరే జీవి – నీకు తెలుసో లేదో ఈ గోవిందు పేరు చెబితే ప్రేమ పది బార్ల దూరంలో ఆగిపోతుంది.

జీవి : అంటే – యూ మీన్ ?

విందు : అంటే నేనెవర్ని ప్రేమించలేదు – ప్రేమించను గూడా !

జీవి : చాలా ధారుణంగా మాట్లాడుతున్నావ్‌రా విందూ ....సృష్టిలో కల్లా తియ్యనిది ప్రేమేరా. నువు గూడా ఎవర్నన్నా ప్రేమిస్తేనే గాని ఈ విషయం నీ కర్థం గాదు.

విందు : ట్రాష్ – నాన్‌సెన్స్. సృష్టిలో కెల్లా తియ్యనిది స్నేహమేనోయ్ అని వెనకటికో కవి గారన్నార్ట...కాని నేనంటాను – సృష్టిలో కెల్లా తియ్యనిది – డబ్బు, డబ్బేనోయా – అని

జీవి : విచిత్రంగా మాట్లాడుతున్నావ్ – అద్సరే – మరయితే ఇందాకా ఆ కర్చీఫ్ కోసం ఎందుకంత కంగారుపడ్డావ్.

విందు : ఆ కర్చీఫ్‌లో కరెన్సీ వుంది. అంటే డబ్బుంది. అందుకు

( అంటూహేంగర్ కున్న ప్యాంటు జేబులోంచి కర్చీఫ్ తీసి, డబ్బులు సరిచూసుకుని జేబులో పెట్టుకుంటుండగా )

జీవి : ఒరే విందూ – అర్జెంటుగా నాకో వంద రూపాయలు కావాల్రా సర్దగలవా ?

విందు : ( ఆశ్చర్యంగా చూస్తూ )

మొదట్లో అయిదు, పది అడుగుతుండేవాడివి. ఈ ప్రేమలో పడ్డాక రేటు పెంచి పచ్చకాగితానికి తక్కువడగటం లేదు. జాగ్రత్తరేయ్ జీవి – ఆడదాని కోసం అప్పుల్చెయ్యటం మొదలెడితే అల్లరి పాలౌతావ్ – అవస్థల పాలౌతావ్.

జీవి : అవున్రా – ప్రేమ కూడా ఒక అవస్తే – ఆ అవస్థల పాలౌటం కన్నా ఇంకేం కావాల్రా మనిషికి – అదొక గొప్ప థ్రిల్లు రా విందూ ...

విందు : థ్రిల్లు కాదు – డ్రిల్లు –సరే అవన్నీ నాకెందుగ్గాని, ఇంతకీ వంద దేనికిట.

జీవి : ఇవ్వాళ వాణీ పుట్టిన రోజురా.

విందు : వాణీ అంటే ....సరే సరే ...అర్ధమైంది....అయితే ఆమె పేర్న గుళ్ళో అభిషేకాలూ, అర్చనలూ చేయించాలా ?

జీవి : కాదురా – చీరె కొనివ్వాలి.

విందు : ఎవరికీ – వాణీకీ – అయ్‌మీన్ నీ ప్రేయసికే

జీవి : కాస్త ముందుకొచ్చి జేబులోంచి ఫోటో తీసి ( రహస్యంగా చూసుకుంటూ ) అవున్రా – నా కోసం ఆశగా ఎదురు చూస్తూ వుంటుంది. ఆ కళ్ళు నే కనిపించగానే తళుక్కున మెరుస్తాయ్. నే తెచ్చిన చీరె వాణీ ధరించాలి.....అప్పుడు ....అప్పుడు.

విందు : అప్పుడు నీ కళ్ళు తళుక్కున మెరుస్తాయ్ – భేష్ బావుందిరా కానీ ఒరే జీవి, ఓ విషయం గుర్తెట్టుకో – ఈ కళ్ళు మెరవటానికి, మొహం వెలగటానికి . పరవశించటానికి గూడా పైసలు ....పైసలు డబ్బు కావాల్రా – డబ్బుల్లేని ప్రేమ మంచు ముద్దలాంటిది. అవసరాలనే ఆవిరి కరిగి నీళ్ళు కారిపోతుంది నీ ప్రేమ.

జీవి : నీ ఫిలాసఫీ నీది... కాదంటానికి నేనవర్ని ? అయినా విందూ ఒక విషయం. ఈ ప్రాపంచిక బాధలకి, సుఖాలకి అతీతమైంది ప్రేమ. కష్టాలకి పెరవనిది. కన్నీళ్ళల్లో పునీతం అయ్యేది ప్రేమ. దీనికి అవధుల్లేవు....ఇంకా చెప్పాలంటే....

విందూ : దీనికి పొడుగు – వెడల్పులూ, లోతులూ గోతులు కూడా లేవు. దీనికి కళ్ళు, చెవులూ, మెదడు గూడా వుండవ్ – సరేనా?

( విందు తనని గేలీ చేస్తున్నాడని గ్రహించాక రోషంగా )

జీవి : సరే – ఇంతకీ డబ్బులిస్తున్నావా లేదా ?

విందూ : సపోజ్ లేవంటే ...

జీవి : నన్ను నేను అమ్ముకునైనా వాణీకి చీర తీసుకెడతాను.

విందూ : ( చప్పట్లు చరుస్తూ ) భేష్ – బావుంది రా – ప్రపంచ ప్రేమికుల్లారా ఇలా రండి – మా జీవి గాడిని చూసి నేర్చుకు తగలడండి.

జీవి : విందూ !

విందూ : సర్లే – మనిషి నెలాగూ పరిచయం చెయ్యలేదు. కనీసం ఫోటో అన్నా చూపిస్తావా ?

జీవి : ( చేతిలోని ఫోటోని అపురూపంగా గుండెలకద్దుకుంటూ ) అమ్మో నే చూపించను అసలే నీ నోరు మంచిది కాదు ! ( జీవి చేతిలోని ఫోటో జారి క్రింద పడింది – అది గమనించని అతడు ముందు కెళ్ళిపోయాడు – విందు ఆ ఫోటోని తీసుకుని దీక్షగా చూస్తుండగా ) రేయ్ విందూ – మనిషన్న ప్రతివాడు జీవితంలో ఒక్కసారన్న ప్రేమించాలి – అప్పుడే ఆ బతుక్కి సార్ధకత. నీ కష్టానికి కన్నీళ్ళు పెట్టి, బాధపడే ఇంకో వ్యక్తి వుందంటే అంత గొప్ప అనుభూతి ఏం ఉంటుందిరా.

విందూ : ( ఫోటోని చూస్తూ ) గుడ్ పిల్ల బావుందిరా. మంచి పర్సనాలిటీ కళ్ళు ఫెంటాస్టిక్ – కాని ఒరే జీవి – మంచి పిట్టనే ప్రేమించావురా

( తన చేతిలో ఫోటో లేదని తెల్సుకుని జీవి, ఆత్రంగా స్నేహితుడి పైకి వురకబోయేడు – కాని విందు అతడ్ని చేత్తో ఆపేస్తూ )

విందూ : చిన్న డౌట్రా

జీవి : ఏవిటి .

విందూ : వొట్టి భావ కవిత్వాలు, ప్రేమతత్వాలేనా ఇంకైదేనా అఘోరించావా .

జీవి : అంటే....?

విందు : నువ్వేం ప్రేమికుడివిరా – వుత్త పాత కాలం ప్రేమికుడిలా వున్నావ్. అంటే ....మీ భాషలో చెప్పాలంటే ....మనస్సుల్లాగే ....మనుషులు గూడా ....కల్సిపోవటం ....ఐక్యం అయిపోవటం అనిమాట.

జీవి : ఛ .ఛ. వెధవాల్లోచన్లు నువ్వూను – మాది నిష్కల్మషమైన ప్రేమ నిర్మలమైన ప్రేమ తుచ్ఛమైన ఆలోచన్లు రానే రావు.

విందూ : నీ బొంద ప్రేమ నువ్వూను. ప్రేమిస్తున్నానని చెబుతూనే అమ్మడ్ని ఆశీర్వదించెయ్యాలి.

జీవి : ఆశీర్వదించటమా ....అంటే ...?

విందూ : అంటే అనుభవించెయ్యటం అన్నమాట – ఆడది కోరుకునేది చచ్చు ప్రేమ కబుర్లు కావు – ఆశీర్వాదబలం – తెల్సుకో –

( ఫోటో ఇచ్చేస్తాడు )

( జీవి బయటికెళ్ళటానికి చెప్పులు తొడుక్కుంటూ )

జీవి : నీ మాటలు ఇంకాస్సేపు వింటే అసలు మనుషులపైనే అసహ్యం పుట్టే ప్రమాదం వుంది. నే వెళ్ళొస్తా – ఇంతకీ డబ్బులూ....

విందూ : ( తన ధోరణిలో తను ) పూలు, వెన్నెల, చల్లగాలి, పన్నీరు, మంచిగంధం – వీటి నన్నింటిని ఏం చేస్తాం – అనుభవిస్తాం – ఆడది గూడా అంతేరా, అదొక సుగంధ ద్రవ్యం –మగవాడి అనుభవం కోసం సృష్టించబడ్డది – ఆలస్యం చేస్తే వయసనే సువాసన పోగొట్టుకుని వాడిపోతుంది.

జీవి : ఆడదంటే ఎంత హీనమైన అభిప్రాయం – ఛ ఛ చాలా సిగ్గుగా వుందిరా నిన్ను చూస్తుంటే

విందూ :( అదే ధోరణిలో ) ఇప్పటి వరకు – అంటే ఈ రోజు, ఈ నిమిషం వరకు – పద్దెనిమిది మంది ఆడకూతుళ్ళని ఆశీర్వదించేసాను – తెల్సా ? అసలు నే రోడ్డుపై నుంచి వెడుతుంటే ఆడవాళ్ళు,పెళ్ళయిన వాళ్ళు, కాని వాళ్ళు, కాదని నిర్ణయించేసుకున్న వాళ్ళు నా వంక ఎలా చూస్తారో తెల్సా – ఆశగా కోర్కెగా ....అదోలా. ...ఆశీర్వాదం కోసం అర్రులు చాస్తూ

జీవి : సరే –స రే – నే వెడతున్నా – వాణిని కలవాలి ( వెళ్ళబోయేడు )

విందూ : డబ్బు అడిగావ్ – మర్చిపోయావా ?

జీవి : డబ్బు కోసం మనిషి కాదురా ! మనిషి కోసం డబ్బు – మైండిట్ – నువ్విచ్చే డబ్బు కోసం నీ వాగుడంతా భరిస్తాననుకోవటం పొరపాటు

( సరిగ్గా అదే సమయానికి సంహాచలం వచ్చేడు – ఒక చేతిలో బుట్ట ఇంకో చేతిలో చీపురు వున్నాయ్ – ఆశ్చర్యంగా ఇద్దర్ని గమనిస్తున్నాడు. కాని వాళ్ళిద్దరూ అతడి రాకని గుర్తించక తమ ధోరణులలో తామున్నారు. )

విందూ : హియర్ ..హియర్ – ప్రేమ ముదిర పాకానా పడింది – పిచ్చి తల కెక్కింది. సరే ఇదిగో

( జేబులోంచి డబ్బులు తీసి ఇచ్చేడు ) ప్రేమ ప్రేమంటూ పరుగులెత్తకు బోర్లపడతావ్

( జీవి కటువుగా చూసి డబ్బులందుకుని వెళ్ళి పోయేడు ) మగ వాడ్ని దసరా కోతిబొమ్మని చేసి ప్రేమనే కర్ర ముక్కకి కట్టి పెళ్ళనే తాడుతో ఆడది

ఆడించేస్తుంది. వాడి జీవితమంతా – ఆ విషయం తెల్సుకున్న నాలాంటి వాళ్ళు ఆ ప్రమాదంలో తెలివిగా తప్పుకుంటారు. తెలీని జీవిలాంటి అమాయకపు జీవులు జీవిత మంతా ఆడేస్తుంటారు. ప్రపంచ ప్రేమికుల్లారా ఏకంకండి కళ్ళు తెరవండి... ( సింహాచలం జీవి వెళ్ళిన వైపు – ఆ పైన గోవిందు వైపు ఆశ్చర్యంగా చూసి – కాస్త ముందుకొచ్చి )

సింహాచలం : ఏంటిబాబు ఇయ్యాల తమలో తామే మాట్లాడేసుకుంటున్నారు.

విందూ : ఓ సింహాచెలం నువ్వా – అసలీ కాలం కుర్రాళ్ళని చూస్తుంటే మా చెడ్డ దిగులుగా వుంటుందోయ్.

సింహా : దిగుళ్ళలో రెండు రకాలున్నాయండి ? మంచి దిగుళ్ళు, చెడ్డ దిగుళ్ళు అని అలా అయితే మంచి దిగుళ్ళు మంచోళ్ళకి , చెడ్డ దిగుళ్ళు చెడ్డోళ్ళకి రావాలండి – అలా కాక చెడ్డ దిగుళ్ళు మంచోళ్ళకి....

విందూ : సింహాచలం రికార్డు పెట్టకు. చెప్పేది విను.

సంహా : అయ్యా – అలాగే చెప్పుకోండి.

విందూ : నువ్వా – ఎవర్నన్నా ప్రేమించావా .

సింహా : ( సిగ్గు పడుతూ ) ప్రేమించానండీ.

విందూ : ఎవర్నిరా ?

సింహా : అంటే ఆడా మగా నాండి – ఆడ కూతురేనండి – అప్పాయమ్మని

విందూ : అదెవర్రా....

సింహా : ఎవరేంటండి – నా వైఫండి.

విందు : ఏవిటి నిజంగా ?

సింహా : అదేటండి అలా చూత్తాలు , అంటే పెళ్ళాన్ని పేమించగూడదాండి.

విందూ : అది కాదురా, నీకు పెళ్ళయిందా

సింహా : ఎప్పుడో అయిందండి – మీసాలు రాగానే మా అయ్య పెళ్ళి చేసేడండి.

విందూ : గుడ్ – ఎర్లీ మ్యేరేజన్న మాట పిల్లిలా .

సింహా : లేరండి – అసలు కలిసుంటే గదండి పిల్లలుట్టేది.

విందూ : అంటే విడాకుల బాపతా .

సింహా : కాదండి – మీరలా కూకోండి – అస్సలు నా ఇస్టరీ అంతా సెప్పేస్తాగా

( గోవిందు కుర్చీలో కూర్చున్నాడు – సింహాచెలం అతడి కాళ్ళ దగ్గిర కూర్చుని చెపుతున్నాడు )

నా వైపుంది గదండి. దానికో అయ్యున్నాడండి – ఆడికో పేరుందండి కనకయ్యండి. ఆడు కలెక్టరాఫీసులో ప్యూనండి – ప్యూనంటే తెల్సుగదండి. బిళ్ళ బంట్రోతు అన్నమాట. ఆడు కలక్టరు గారు గదిలో కెడితే అయిదు బయట కొస్తే పది ఇస్తారండి జనం. అసలాడు కలక్టరు గారి కన్నా ఎక్కువ సంపాదిత్తాడండి. అందుకని ఆడింట్లో రోజూ కోడికూర, రొయ్యలేపుళ్ళుంటాయండి.

విందూ : సింహాచలం రికార్డాపు ?

సింహా : ఆపనండి – అదంతేనండి – అప్పాయమ్మకి – అంటే నా వైపుకి తిండి పిచ్చండి. తింటానికేం లేకపోతే ఏడుస్తుంటుంది. దానికి

( రోజూ కోడికూర – రొయ్యల పులుసు కావాలండి – మరి నే పూనే గాడ్ని గదండి – అయన్ని పెట్టలేనండి – అందుకని అప్పయమ్మ ఆళ్ళ య్యింటికెళ్ళిపోయిందండి .

విందూ : అంటే మళ్ళీ రాదా ?

సింహా : నే కావాలంటే నువ్వే ఆడకొచ్చేయ్యమని చెప్పేసి వెళ్ళిందండి ఇంకెందుకొస్తుందండి.

( గోవిందు కూర్చున్న వాడల్లా లేచి నిల్చుని ఆశ్చర్యంగా )

విందూ : అంటే నువ్వు డబ్బుల్లేని వాడివి కాబట్టి నీ పెళ్ళాం నిన్ను కాదని వెళ్ళిపోయింది – అవునా !

సింహా : అంతే గదండి ఇంతసేపు సెప్పింది.

విందూ : సింహాచెలం – ఇదీ జీవితమంటే – ఈ చిన్న విషయం తెలీక ఆ జీవిగాడు ప్రేమలో పడి కొట్టుకుంటున్నాడు.

సింహా : కానీ బాబూ, – ఇంకో ఇసయం

విందూ : ఏవిటి ?

సింహా : నన్నొగ్గేసి యెల్లిపోయినా, అప్పాయమ్మంటే కోపం లేదండి.

విందూ : ఎందుకని.

సింహా : ఎందుకంటే రోజూ అది కోడికూర, రొయ్యిలేపుడు తింటే నాకు బలే సంతోషం
గుంటుందండి. అదక్కడ కోడి కూర తింటే నాకిక్కడ కడుపునిండి పోద్దండి.
అదక్కడ రొయ్యల పులుసు తాగితే నాకిక్కడ బేవ్‌మని తేను పోచ్చేస్తుందండి –
దాన్నె మంటారు – బాబూ ?

విందూ : అదే పిచ్చంటే – ఎవడి పిచ్చివాడి కానందం అని

సింహా : బాగా సెప్పారండి ...అవును తమరేటి బాబూ – ఇలా వుండి పోయేరు ?

విందూ : అవునవును – స్నానం చెయ్యాలి – కుళాయిలో నీళ్ళు రావటం లేదు.

సింహా : నేననేది స్నానం గురించి కాదండి.

సింహా :మరి ?

సింహా : అదేనండి. పెళ్ళి ప్రేమ లేకుండా

విందూ : ( అద్దంలో మొహాన్ని చూసుకుంటూ )
ప్రేమంటే నమ్మకం లేదు. పెళ్ళంటావా ( నవ్వి ) పెళ్ళెందుకురా కడుపు
నిండుతుంటే....

సింహా : కాని బాబు... బయటి కూళ్ళు, తింటే ఆరోగ్యం దెబ్బ తింటుంది. జాగ్రత్తండి.

విందూ : సింహాచెలం నువ్వుత్త ఫూల్‌విరా....

సింహా : అవునండి – అందుకే కదండి – మీ వద్ద కొచ్చేను – బాబూ – చిన్న
సంగతండి....

విందూ : ఏవిటి ?

సింహా : అప్పాయమ్మని చూసి రెండ్నెల్లయి పోయినాదండి.

విందూ : అయితే నన్నేం చెయ్యమంటావ్

సింహా : ఓ యాభై వుంటే ఇప్పించండి – ఎల్లి చూసొస్తా....

విందూ : యాభై తకలేసి అంతదూరం పోవటం ఎందుకురా ?

సింహా : మరేటి చెయ్యాలండి !
( అతడి చెవిలో గోవిందు ఏవో చెప్పేడు. అది విని సింహాచలం అసహ్యంగా
మొహం పెట్టి )
అలాంటివి నాకసహ్యం బాబూ, అప్పాయమ్మకి అన్యాయం సెయ్యలేను.

విందూ : వెధవలు – సుఖాలకి సిమెంటు రోడ్డేసినా ప్రేమని, పవిత్రతని పేర్లు పెట్టుకుని పాత డొంకల్లోంచే పోతామంటారు ....

May god save His country and His poor simhachalam also.

సింహా : ఏంటి బాబూ – ఇంగ్లీషు రికార్డెట్టీసారు.

విందూ : నీకర్ధమయి చావదుగాని, కుళాయి వచ్చిందేమో, నే వెళ్ళి స్నానం చేసొస్తా – ఈ లోపు ఇల్లు శుభ్రం చెయ్యి – ( తుండు భుజాన వేసుకుని గోవిందు లోపలికెళ్ళిపోయేడు )

( సింహాచలం అతడెళ్ళిని వైపే చూస్తూ )

సింహా : గొప్ప ముదురుకేసు – చిరంజీవి చందమాలాంటోరు మెత్తటి మనస్సు – అబ్బో ( లోపలికి చూపిస్తూ ) ఈడట్టకాదు. మాంసంకత్తిలాంటోడు –

( అని ఇల్లు శుభ్రం చేస్తుంటాడు )

జీవి : సింహా చెలం – విందేడి ?

సింహా : ఆరిప్పుడే స్నానం చేసొస్తానని ఎల్లేరండి. పిలవమంటారా బాబూ

జీవి : అక్కర్లేదులేగాని – ( ప్యాకెట్టులోంచి చీరే తీసి చూపిస్తూ ) ఎలా వుందిరా ?

సింహా : బేషుగ్గదండి – ఎవరికండి ?

జీవి : ( తన్మయత్వంతో ) నా వాణికి . ఇవ్వాళ నా వాణీ పుట్టిన రోజురా బహుమతిగా నీకేం కావాలంటే – ఏం అక్కర్లేదు నువ్వొస్తే చాలంది కాని ఈ చీరే తీసుకెడుతున్నా. ఆశ్చర్యపోతుంది. ఇబ్బంది పడుతూ ఎందుకు తెచ్చారని మందలిస్తుంది – ఆ మందలింపులో ఎంత మాధుర్యం వుందో నీకు తెలీదు సింహాచెలం.

సింహా : నాకన్ని తెలుసు కానిండి – ఇప్పుడి కోకతోపాటు తోకలా ఆ గోవిందంగాన్ని గూడా తీసుకెళ్తారా !

జీవి : లేదురా – నే వొక్కడ్నే వెడతా.

సింహా : ఆ పన్చెయ్యండి బాబూ ఎల్లిరండి – ఆ యమ్మయెయ్యి కళ్ళతో తమకోసం ఎదురుచూత్తా వుంటుంది.

జీవి : అవునవును – వెళ్ళొస్తా ఆ గది తాళం చెవిని బయట చూర్లో పెట్టమని విందుగాడికి చెప్పు – నేనిప్పుడే వస్తా.

( అనుకుంటూ  కళ్ళు తుడుచుకుని, ప్యాకెట్ చేత్తో పుచ్చుకుని వెళ్ళిపోయేడు )

సింహా : ( అతడెళ్ళిన వైపుగా చూస్తు ) మందలింపులోని మాధుర్యం, ప్రేమ లోని తీపి నాకూ తెల్సు చిరంజీవిగారూ,  నేనిలా కూలీవాడిలా బతకటానికి ప్రేమేకారణం – నా భాదని ఎవరికి చెప్పుకోను “ విష్యు  గ్రాండ్ సక్సెస్ ”

విందూ : ( అంటూండగా చొక్కా మార్చుకుని  వచ్చేడు ) వెధవ కుళాయిలు స్నానం చెయ్యాలని  కూర్చుంటే  వృద్ధాప్యం వచ్చేట్టుంది, సింహా  చెలం త్వరగా  వెళ్ళి ఆ రెండు  గిన్నెలు తోమి బోర్లించు. నే బయటకెళ్ళాలి. అవునూ  ఏవిట్రా అట్లావున్నావ్ ?

సింహా : ( కంగారుగా భాష మార్చేసి )  అబ్బే ఏం లేదండి – నాకెక్కువ సంతోషం  వస్తే నా మొహం  ఇలాగే వుంటుందండి.

విందూ : అలాగా సర్లే వెళ్ళు – అవునూ  ఇంతకీ అంత సంతోషం  వున్నట్లుండి ఎంతుకొచ్చినట్లు ?

సింహా :  ఓ అదా – చిరంజీవి  బాబు గారొచ్చారు కదండి – అర్ని చూసి.

విందూ : చిరంజీవి  బజార్నించి వచ్చాడా ఏడి .

సింహా : ఎల్లిపోయారండి

విందూ : ఎక్కడికి ?

సింహా : అదేటండి పేమించినోళ్ళంతా ఎక్కడికెడతారో  ఆ బాబుగూడా సరిగ్గా అక్కడికే ఎల్లారండి.

విందూ : అంటే వాణీ  దగ్గరకెళ్ళాడా !

సింహా :  అవునండి. కొత్తకోక ఇచ్చేసి  వత్తాన్నారండి. తాలం చూర్లో ఎట్టమన్నారండి.

విందూ : సర్లే నువ్వెళ్ళి ఆ పని పూర్తిచెయ్యి – త్వరగా బయటికెళ్ళాలి.

( సింహాచెలం  లోనికెళ్ళిపోయేడు. గోవిందు  తల దువ్వుకుంటుండగా  లక్ష్మీపతి వచ్చేడు. ఖరీదైన  బట్టలు, నోట్లోపైపు – దర్జా, ఠీవి – చూడంగానే శ్రీమంతుడని ఇట్టే అర్ధమౌతుంది )

విందూ : ఎవరు కావాలండీ ?

లక్ష్మీపతి : ( కటువుగా ) నువ్వే కావాలి

విందూ : ఇంతకీ మీరు...

లక్ష్మీపతి : నేనెవరో, తెలీదు కదూ – నా పేరు వింటే వులిక్కిపడతావ్. నువ్వేమిటి చాలా మంది భయపడతారు. ఈ ఊళ్ళో ఆస్తులవారీగా శ్రీమంతుల పేర్లు నాలుగైదు చెబితే అందులో ఖచ్చితంగా నా పేరు ముందుండి తీరుతుంది. లక్ష్మీపతి పేరు విన్నావా ?

విందూ : అంటే బిజినెస్ మాగ్నెట్ లక్ష్మీపతేనా ?

లక్ష్మీపతి : గుర్తుపట్టేవుగా – ఈరోజుకి – కాదు ఈ క్షణానికి నా ఆస్తుల విలువ ఆరుకోట్లు.

విందు : ఇలా వచ్చి కూర్చోండి.

లక్ష్మీపతి : కుర్చోను – అసలు నీలాంటి సామాన్యుడితో మాట్లాడటమే నామర్దా, బిలో మై డిగ్నిటీ.

విందూ : మీ పేరు విన్నాను కానీ...

లక్ష్మీపతి : పేరు వినుండొచ్చు – కానీ పంజా రుచి చూసుండవ్ – నే తల్చుకుంటే ( పళ్ళు పటపట లాడించేడు )

విందూ : మీ ధోరణి నాకర్ధం కావటంలేదు.

లక్ష్మీపతి : అవునర్ధం కాదు – తెల్లారి లేస్తే నీలాంటి తెల్లమొహం నిరుద్యోగులు వేలమంది నా ఇంటి చుట్టూ తీర్ధయాత్రలు చేస్తుంటారు – ఎందరికో వుద్యోగాలిచ్చి సహాయం చేసేను – కాని నీలాంటి రాస్కెల్స్‌కి .....

విందూ : క్షమించండి – హద్దుమీరి మాట్లాడుతున్నారు. మీకు నే చేసిన ద్రోహం ఏవిటి ?

లక్ష్మీపతి : ద్రోహం చేసేవ్ గనుకనే ఏం తెలీనట్లు అడుగుతున్నావు – ప్రపంచంలో తండ్రులంతా కూతుళ్ళనెలా పెంచుతారో నా కనవసరం, కాని నేనెలా పెంచానో తెల్సా.నడిస్తే దాని కాళ్ళరిగిపోతాయని ఇల్లంతా పాలరాళ్ళు పరిపించాను. కాలేజీ కెళ్ళటానికో మోడల్ కారు – స్నేహితుల్తో తిరగటానికో మోడల్ కారు, అది కోరిన తిండి, బట్ట, నగ. ప్రపంచంలోని సుఖాలన్నిటినీ తెచ్చి దాని ముందు ఆట బొమ్మల్లా పేర్చేను – ఆకలవటం లేదంటే అల్లాడిపోయేను – ఫ్లూ జ్వరానికి గూడా మందులు ఫారిన్ ప్లేన్లో తెప్పించాను – ధటీజ్ లక్ష్మీపతి

విందూ : అయ్యుండొచ్చు – సహజంగా తండ్రి – అందులో డబ్బుంది సో – మీరు చేసానని చెపుతున్నవన్నీ మీ పరిస్థితుల్లో వున్న ఏ తండ్రయినా చేస్తాడు – చెయ్యకపోతేనే

ఆశ్చర్యపడాలి కాని నాకర్థంకానిదల్లా – ఈ విషయాలన్ని నాకెందుకు చెపుతున్నారా అని.

లక్ష్మీపతి : ఏం – అది గూడా నేనే చెప్పాలా ? అసలు డబ్బున్న వాళ్ళకి ఆడపిల్లలుండగూడదంటాను. వాళ్ళనడ్డం పెట్టుకుని నీ లాంటి గర్భధరిద్రులు, ఆఫ్ట్రాల్ గాళ్ళు ప్రేమ నటించి పీఠం ఎక్కాలని ప్రయత్నిస్తారు. – యస్ నువ్వు చేసిందదే – అంత గారాభంగా పెంచిన నా వాణీని ప్రేమనే మత్తుచల్లి నా నుంచి ఆస్థి కాజెయ్యాలని కుట్రపన్నేవు – కాదంటావా .

విందూ : ( ఆశ్చర్యంగా ) ఏవిటి మీరు – మీరు వాణి తండ్రా ?

లక్ష్మీపతి : ఏం తెలీనట్లు నాటకం ఆడకు మిస్టర్ చిరంజీవి – నా గురించి నీకు తెలీదు. కాని నీ గురించి నాకు తెలుసు.

( సింహాచలం అదే సమయానికొచ్చి వెనగ్గా నిల్చుని అంతా వింటున్నాడు )

( లక్ష్మీపతి ఆవేశంగా చెప్పుకు పోతున్నాడు ) – మిస్టర్ చిరంజీవి – నా ఇంట్లో నౌకరుగానో, డ్రైవరుగానో వుండాల్సిన వాడివి. అల్లుడి హోదా కోసం పథకం వేసి అభం శుభం తెలీని వాణీకి ప్రేమ నేర్పావ్ – కాదు నటించావ్ – కదూ...

( గోవిందు బదులివ్వక కాస్త ముందుకొచ్చి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు )

ఔను – నువ్వు – కాదనలేక సత్యం పీక నులిమెయ్యటం అంత తేలికైన విషయం కాదు.( గోవిందు ఏదో నిర్ణయించుకున్నట్లు తలాడించి )

విందూ : అసలు...అసలూ....

లక్ష్మీపతి : అసలు మొదటే ఈ విషయం తెల్సుంటే, వ్యవహారం ఇంత దూరం రానిచ్చేవాడిని కాను – కాని నే రోజుకో వూళ్ళో వుంటాను. లక్ష వ్యవహారాలు – పట్టించుకోలేను. అదే అదే నీకు పెట్టుబడైంది.

( సంభాషణని ఆలకిస్తున్న సింహాచలిన్న చూసి తలాడించి జేబులోంచి డబ్బులు తీసి )

విందూ : సింహాచలం – వెళ్ళి సిగరెట్ ప్యాకెట్ పట్రా

( డబ్బులందించాడు, సింహాచలం అనుమానంగా బయటికెళ్ళేడు )

( లక్ష్మీపతితో ) ఆవేశపడకండి. అలా కూర్చోండి – తాపీగా మాట్లాడుకుందాం.

లక్ష్మీపతి : తాపీగా నీతో కబుర్లు చెప్పటానిక నేనేం నీలాగా బుక్కా పకీరు ననుకున్నావా. ప్రతి క్షణం నాకు విలువైంది. కాలాన్ని కరెన్సి లోకి మార్చగల దిట్టని, అసలు నా హెూదాకి, అంతస్తుకి నేనింత వరకూ రానక్కరలేదు. చిటిక వేస్తే క్షణాల్లో తెచ్చి నిన్ను నా ముందు పడేస్తారు – అయినా ఎందుకొచ్చానో తెల్సా ?

విందూ : ఎందుకొచ్చార్ట .

లక్ష్మీపతి : ఇరవై ఏళ్ళు ఆరోప్రాణంగా అతి గారాబంగా పెంచుకున్న నా కూతురు – ఇష్టపడుతున్న వ్యక్తి ఎంత గొప్పవాడో కళ్ళారా చూద్దామని వచ్చేను – చూస్సేక అర్ధమైంది.

విందూ : ఏవని ?

లక్ష్మీపతి : వాణీ ఘోరంగా మోసపోయిందని – కాదు మోసపుచ్చేవని, అందుకు నిన్ను క్షమించను.

విందూ : చరిత్రలో పెద్దలు ఏ ప్రేమికుల్ని క్షమించలేదు – వాళ్ళ ప్రేమని అంగీకరించలేదు. క్షమించకపోతేనే చరిత్రవుతుంది. అంచేత క్షమించండి ప్లీజ్.

లక్ష్మీపతి : అంటే అది హెచ్చరికా – బెదిరింపా ?

విందూ : ఏది కాదు – పిల్లల ప్రేమ పెద్ద వాళ్ళకి పాములా కనిపించి బుసకొట్టి భయపెడుతూంది. వి కాంట్ హెల్ప్ ! కాని నే చెబుతోంది – వాణీ పట్ల నా నిర్మలమైన ప్రేమ – దాన్నెవరైనా కించపరిస్తే సహించను.

లక్ష్మీపతి : ప్రేమ ( పళ్ళు కొరికి ) డబ్బున్న లక్ష్మీపతి కూతుర్నే ఎందుకు ప్రేమించావ్ – ఏ గుమాస్తా గాడి కూతుర్నో, ఏ రిక్షావాడి కూతుర్నో ప్రేమించలేకపోయావ్ – వుహూ – నీక్కావలసింది ప్రేమ కాదు – ఆస్థి, అంతస్తు....

విందూ : ( చిన్నగా నవ్వి ) మీరసలే వ్యాపారస్తులు. ఏదైనా కొనగల్రు అమ్మగల్రు – కాని ఈ ప్రేమనే రెండక్షరాల పదానికున్న పవర్ మీకు తెలీదు. చెప్పినా అర్ధం కాదు. ఇంత గొప్ప లక్ష్మీపతిని సామాన్యుడైనా ఈ చిరంజీవి వద్దకు రప్పించింది. " ధట్ ఈజ్ లవ్, ధటీజ్ పవర్ ఆఫ్ ద లవ్ " దీన్ని బట్టి అక్కడ మీకూతురు మీకెంత సమస్యగా తయరైందో నా కర్ధమైంది. యామ్ ఐ కరెక్ట్.

లక్ష్మీపతి : ( మొహంలో మార్పొచ్చింది ) యూ ఆర్ కరెక్ట్. ఈ రోజు వాణీ బర్త్‌డే – అంటే

నాకు పండగ రోజు, పర్వదినం. ఢిల్లీలో కంపెనీ మీటింగు కూడా క్యాన్సిల్ చేసుకుని రాత్రికి రాత్రి వచ్చి వాలేను. కేవలం నా కూతురు బర్త్‌డే నాడు ఆమెతో గడపాలన్న ఆశతో, వస్తూ పట్టుచీరెని, ఫస్టుక్లాస్ సంబంధాన్ని తెచ్చాను ఆమెని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాలన్న ఆకాంక్షతో వచ్చేను.

విందూ : కాని మీ కూతురు ప్రేమ విషయం చెప్పి మిమ్మల్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది అవునా !

లక్ష్మీపతి : ఆశ్చర్యంలో కాదు – అంధకారంలో – నా పథకాలన్నీ తారు మారయ్యాయ్ నా కలలన్నీ పటా పంచెలయినాయ్ రాత్రే తొలిసారిగా చెప్పింది. " చిరంజీవిని ప్రేమిస్తున్నాననీ – ఇంకో వ్యక్తిని భర్తగా ఊహించలేనూ " అని

విందూ : కోపంతో మందలించబోయేరు – అవునా

లక్ష్మీపతి : అంతేకాదు నీ లాంటి సామాన్యుడ్ని కట్టుకుంటే ఎంత నికృష్టమైన జీవితాన్ని గడపాలో కళ్ళకు కట్టినట్లు వివరించి చెప్పేను.

విందూ : కాని వాణీ చిరునవ్వుతో " జీవి వుంటే చాలంది. ప్రపంచంలో ఇంకేం అక్కర్లేదంది " కదూ

లక్ష్మీపతి : అవును అలానే అంది " బలవంతం చేస్తే నా శవాన్ని చూస్తా " రంది భయపడ్డాను – రాత్రంతా కుమిలిపోయేను. ఏవిటీ విచిత్రం. ఏవిటీ విడ్డూరం. ఎక్కడుంది రహస్యం ?

విందూ : థట్ ఈజ్ కాల్డ్ లవ్ – రూపాయికి రూపాలని జతచెయ్యడమే తెల్సుగానీ, జత మనుషుల్ని అర్థం చేసుకోవటం మీకు తెలీదు.

లక్ష్మీపతి : తండ్రినన్న అభిమానం, ప్రేమ. కనీసం జాలీ కూడా లేకుండా నే తెచ్చిన పట్టుచీరె గిరాట్టేసింది. అయిదు వేలు ఖరీదు చేసే ఆ పట్టు చీరె కన్నా నువ్విచ్చే ముతక చీరె దానిక్కావాల్ట – ఇట్ ఈజ్ సమ్‌థింగ్ మిస్టరీ టు మీ....

విందూ : మిమ్మల్ని చూస్తుంటే జాలేస్తుంది. మీకున్న ఆస్థి, హోదా, అంతస్తు, కార్లు, మేడలు, ఏవీ మీకు మనశ్శాంతి నివ్వలేకపోతున్నాయ్ కారణం ఏవిటో తెల్సుకున్నారా లక్ష్మీపతి. వాటిని మించిన విలువైన ఆయుధం నా ప్రేమ.

లక్ష్మీపతి : నా ఆస్థి, హోదా, అంతస్తు ఉపయోగించి నిన్ను క్షణాల్లో పరలోకానికి పంపెయ్యగలను – కానీ.

విందూ : కానీ – ఆ సంగతి తెల్సిన మరుక్షణం మీ కూతురు నన్ను వెతుక్కుంటూ అదే లోకానికొచ్చేస్తుంది. కావాలంటే ట్రై చెయ్యండి. నే సిద్ధంగా వున్నా.

లక్ష్మీపతి : మిస్టర్ చిరంజీవి నీలో నాకు మంచి వ్యాపారవేత్త కనిపిస్తున్నాడు ప్రేమికుడు కాదు.

విందూ : అయ్యుండొచ్చు – రాకెట్ యుగంలో మనుషులంతా రావణ బ్రహ్మలే మీరో మొహం చూసి వ్యాపారవేత్త అంటున్నారు. ఇంకో మొహం చూసి వాణీ ప్రేమికుడ్నంది – రెండూ నిజమే

( సరిగ్గా అదే సమయానికి సింహాచెలం సిగరెట్టు పెట్టెతో తిరిగొచ్చేడు )

సింహా : ఇదిగో బాబు – సిగరెట్టు పెట్టె సిల్లర డబ్బులు.

విందూ : సరే – లోనికెళ్ళి కాసిని కాఫీనీళ్ళు పడెయ్యి

( సింహాచలం లోనికెళ్ళిపోయేడు అనుమానంగా చూస్తూనే )

లక్ష్మీపతి : మిస్టర్ చిరంజీవి – నిన్ను చూస్తుంటే జాలేస్తుంది – వయస్సులో చిన్నవాడిని – పైకి రావల్సిన వాడివి. నీ మీదే ఆధారపడి, నువ్ పై కొస్తే సంతోషపడాలని, సుఖపడాలని ఎదురు చూసే ముసలి తల్లిదండ్రులు, పెళ్ళి కావలసిని చెల్లెళ్ళు ....మధ్య తరగతి వాడికి మతిపోగొట్టే సమస్యలు – బాధ్యతలు నీక్కూడా వున్నాయని నేను ఊహిస్తున్నాను. యమ్ ఐ కరెక్ట్....

విందూ : నిజమే – అంతకాన్న ఇంకేం చెప్పలేను ?

లక్ష్మీపతి : ఇంకే చెప్పొద్దు – కాని నే చెప్పేది విను – వినటం కాదు, ఆలోచించు. ప్రేమ కడుపు నింపదు. నీ సమస్యల్ని పరిష్కరించదు . పైగా మరిన్ని సమస్యల్ని సృష్టిస్తుంది. మొదట ఎంత వుత్తేజ పరుస్తుందో ముందు అంత విరక్తిని , అసహ్యాన్ని పుట్టిస్తుంది.

విందూ : ఇవన్నీ నా కెందుకు చెపుతున్నారో అర్థం కావటంలేదు.

లక్ష్మీపతి : నీ భావి జీవితాన్ని మరో కోణంలోంచి నీకు చూపించాలన్నదే నా ప్రయత్నం, ప్రేమించటం తేలిక కాని జీవితంలో పైకి రావటం చాలా కష్టం. సహనం కావాలి – తెలివితేటలు కావాలి అడ్డొచ్చిన ప్రతివాళ్ళని అంతం చేసే గుండె ధైర్యం కావాలి అదొక తపస్సు.

విందూ : ఇంతకీ మీరనేది.

లక్ష్మీపతి : నా కూతురికి ప్రేమగంతలుకట్టి పెళ్ళాడినంత మాత్రాన, నేను సినిమా తండ్రుల్లా రాజీపడి నిన్ను యువరాజుని చేస్తానని భ్రమపడక – నన్ను కాదంటే కన్నకూతురు గాని, చివరికి కట్టుకున్న దాన్నైనా సరే కాలరాచి పారేస్తాను – కష్టాలు కల్పిస్తాను. ఇదీ జీవితం అని రుజువుల్తో చూపిస్తా.

విందూ : నన్ను బెదిరించటానికొచ్చారా ?

లక్ష్మీపతి : కాను, నీతో బేరం ఆడటానికొచ్చాను !

విందూ : బేరమా ?

లక్ష్మీపతి : అవును – నీకో విధంగా సహాయం చెయ్యటానికొచ్చాను. ప్రేమనే ఆత్మవంచన ప్రక్కనపెట్టి తెలివిగా ఆలోచించమని చెప్పటానికొచ్చాను. నా వాణీని మర్చిపోవాలి. అందటే అసహ్యం అన్చెప్పాలి, నీ మీద మనసు విరిగేటట్లు చెయ్యాలి.

విందూ : అసంభవం, నా పవిత్రమైన ప్రేమని...

లక్ష్మీపతి : స్టాపిట్ – పవిత్రత – అది ప్రేమకెక్కడేడ్చింది . డబ్బు పవిత్రమైంది ? పచ్చనోట్లని పారేస్తే పరమసాధ్వి గూడా పక్కలోకి పరుగెత్తుకొస్తుంది. నే చెప్పినట్లు చెయ్యటనికెంత కావాలో చెప్పు మిస్టర్ చిరంజీవి – నీ ప్రేమని కొనటాకి నే సిద్దంగా వున్నా..... పదివేలు –టెన్ థవుజెండ్స్ – ఓకే ?

విందు : లక్ష్మిపతిగారూ నా ప్రేమని అవమానిస్తున్నారు.

లక్ష్మీపతి : ఇరవైవేలు – ట్వంటీ – హాయిగా ఎక్కడికైనా వెళ్ళిపోయి సుఖంగా బ్రతుకు.

విందు : మీరు చాలా తొందరపడుతున్నారు.

లక్ష్మీపతి : అవును – టైం లేదు– త్వరగా చెప్పు – సరే – ఫార్టీ థవుజండ్స్ – నలభై వేలు – కమాన్ క్విక్.

విందూ : ఆలోచించుకోనివ్వండి ....నా వాణీని...

లక్ష్మీపతి : షటప్ – ఆ మాట నే మళ్ళీ వినదల్చుకోలేదు – త్వరగా చెప్పు....

విందూ : ఇంతటి ప్రముఖ వాణిజ్యవేత్తలు మా ప్రేమకి నలభైవేలు విలువ గట్టటం చాలా ధారుణం లక్ష్మీపతిగారూ....

లక్ష్మీపతి : సరే – అప్పుడప్పుడు వ్యాపారం అన్నాక నష్టాన్ని గూడా భరించాలి అయినా

ఆ నష్టాన్ని నీ నెత్తిన రుద్దటం నాకిష్టంలేదు – దాన్ని కూడా కమాన్ సే యస్ ( అంటూ చేతిలో బ్రీఫ్‌ని పైకెత్తి చూపించాడు ) ( సింహాచలం రెండు కప్పుల కాఫీతో వచ్చి అచేతనంగా నిలబడి చూస్తున్నాడు )

విందూ : లక్ష – వన్ లాక్ – వాణీ మనప్రేమ విలువ లక్ష – లక్షరూపాయలు వాణీ – ప్రియా నన్ను క్షమించు ఈ దరిద్రుణ్ణి కట్టుకుని నువ్వేం సుఖపడలేవు. నీ గురించే త్యాగం చేస్తున్నా వాణీ –మళ్ళీ జన్మంటూ వుంటే తప్పక కల్సుకుందాం ప్రియతమా –గుడ్ బై డియర్ వాణీ ( అంటూ వచ్చి పెట్టెని అందుకోబోయాడు )

లక్ష్మీపతి : ( బ్రీఫ్‌ని కాస్త అతడి కందనివ్వకుండా ) గుడ్ – నిన్ను చూస్తుంటే సంతోషంగా వుంది – కాని ఒక విషయం. వ్యాపారంలో మాట తప్పటం నే సహించను – వాణీ పైన నీ ప్రేమ,నీ ఆశ, కోర్కెలు అన్నిటిని కలిపి నా చేతిలో పెట్టు – కమాన్ ( అంటూ చెయ్యి చాపేడు – గోవిందు చెయ్యి వేసేడు. ఇంకో చేత్తో అతడందించిన పెట్టెని అందుకున్నాడు )

సింహా : ( కంగారుగా ) బాబూ కాఫీ....

లక్ష్మీపతి : మిస్టర్ చిరంజీవి. నీ ప్రేమని నే కొనేసాను. మళ్ళీ నా కూతుర్ని కలిసినట్లుగాని, ప్రేమని, పెళ్ళని చెప్పినట్లుగాని....నా చెవిన బడితే నేరాను. నీ శవం నా వద్దకొస్తుంది. ఒకే వస్తువుని రెండు సార్లు కొనటం నా కలవాటులేదు. థట్ ఈజ్ లక్ష్మీపతి – జాగ్రత్త గుడ్‌బై....

( సింహాచలం వెళ్ళిపోతున్న లక్ష్మీపతి బాబూ. బాబూ అంటూ పిల్చేడు. కాని వినిపించుకోకుండా లక్ష్మీపతి విసురుగా వెళ్ళిపోయేడు )

విందూ : ఏం కావాలి సింహాచెలం ?

సింహా : కాఫీ తీసుకుంటారేమోనని.

విందూ : ఆయనకి కాఫీ ఎందుకు సింహాచెలం, మాట పుచ్చుకున్నాడు. నే డబ్బులుచ్చుకున్నాను. ఆ కాఫీ ఏదో నువ్వే పుచ్చుకుని అలా కూర్చో నీతో మాట్లాడాలి.

సింహా : కాఫీయా – నాకొద్దు బాబూ – నేవెళ్ళిపోవాలా, పన్లున్నాయ్.

విందూ : పన్లా –నాకు వున్నాయిరా –అవునూ, ఇందాక నీ భార్యని చూట్టానికి వెళాతాను,

డబ్బులు కావాలన్నావ్ కదూ... నేనిస్తా. కాని నువ్వడిగినట్లు యాభై కాదు, వెయ్యి – వెయ్యి రూపాయలిస్తా – తీసుకో.

సింహా : వద్దు బాబూ –వద్దూ – నేనసలు అప్పాయమ్మని చూట్టానికెళ్ళనండి అదంతేనండి.

విందూ : ( సింహాచలం వంక సూటిగా చూస్తూ ) మిస్టర్ సింహాచలం. నాకంతా తెల్సు. నువ్వెందుకు కంగారు పడుతున్నావో కూడా తెలుసు. జీవిగాడి ప్రేమని లక్ష రూపాయలకి అమ్మేసాను. ఆ విషయం అంతా విన్నావుకదూ.

సింహా : నేనేం విన్లేదండి – నాకేం తెలీదు. నన్నెళ్ళిపోనీండి.

విందూ :( డ్రాయరులోంచి కత్తి తీసి పెద్దగా నవ్వి ) సింహాచెలం డబ్బు కోసం ప్రక్కవాడి ప్రేమనే అమ్మేసినవాడిని, దాన్ని నిల్పుకోవటానకి ఇంకో ప్రక్కవాడి ప్రాణాలు తియ్యటం అంత కష్టమైన పని కాదనుకుంటాను. ఏవంటావ్ ?

సిందూ : ఏంటి బాబూ, మీరంటున్నదేవిటి ?

విందూ : ఇంకా అర్థం కాలేదా సింహాచెలం –జరిగిన సంగతి ఆ జీవిగాడికి చెప్పావంటే నీ ప్రాణాలు పోతాయంటున్నాను. నీ అప్పాయమ్మ ముసుగేసుకుని శాశ్వతంగా పుట్టింట్లో వుండిపోవాల్సి వుంటుందంటున్నాను. అర్థమైందా సింహాచెలం.

సింహా : అర్థవైందండి. నే చెప్పనండి – నాకేటి పనండి – అయినా పెద్దోళ్ళు ఎన్నో అమ్మేసుకుంటుంటారు. నాకేంటండి మధ్యలో....

విందూ : గుడ్ కాని సింహాచెలం, ఒక్క విషయం, నాతో సహకరించావంటే నాకు పట్టిన అదృష్టంలో నీకు భాగం పంచుతాను, ఇప్పుడు నేను లక్ష్మీపతిని –అంటే కొనుగోలుదారుడ్ని నువు గోవిందుడివి అంటే అమ్ముకునేవాడివి

సింహా : ఈ రికార్డు నాకర్థం కావటంలేదు బాబూ.

విందూ : ఆలోచిస్తే అదే అర్థం అవుతుంది జీవితమంతా ఇలా గదులూడ్చి గిన్నెలు తోమి ఎలా బ్రతుకుతావ్ – కట్టుకున్న దానికి దూరంగా, ఏ ముద్దూ ముచ్చటా లేకుండా, రాయిలా, మృగంలా ....( సింహాచలం కాస్త ముందుకొచ్చి ఆలోచిస్తున్నాడు. తన మాటలు అతడి పైన పన్చేస్తున్నాయని గమనించి వుత్సాహంగా చెప్పుకు పోతున్నాడు – గోవిందు )

ఆలోచించు సింహాచెలం.ఆదర్శం ఆకలి తీర్చదు. నీతి నిజాయితీలు నీకు

సుఖాల్నివ్వవ్ –ఇవన్నీ కావాలంటే డబ్బు.... డబ్బు.... కావాలి ఇంకో పెళ్ళాం దొరుకుతుంది. ఇంకో ప్రేయసి దొరకుతుంది ఇంకో స్నేహితుడు కూడా దొరకుతాడు. కాని ....కాని.... ఇంకో అవకాశం మాత్రం దొరకదు. ప్రతిమనిషికి అవకాశం జీవితంలో ఒక్కసారే దొరుకుతుంది.

సింహా : అంటే మీరనేది ....?

విందూ : ఇక్కడ జరిగిందంతా మర్చిపోవాలి. జీవిగాడి ముందు నోరు విప్పకూడదు. అసలీ వూర్నించే పారిపోవాలి –పదివేలిస్తాను – ఓ.కే

సింహా : పదివేలా ?

విందూ : అవును సింహాచెలం. పదివేలు –టెన్థవుజెండ్స్ ....ఆలోచించు పదివేలు పుచ్చుకుని పారిపోయి సుఖపడతావో, కాదని ప్రాణాలు పోగొట్టుకుంటావో తేల్చి చెప్పు – త్వరగా

( సింహాచెలం ఏదో నిర్ణయించుకున్నట్లు తలాడించి పెద్దగా నవ్వేడు )

విందూ : ఎందుకలా నవ్వుతావ్ సింహాచెలం !

సింహా : ఏంలేదు బాబూ – మిమ్మల్ని సుత్తావుంటే జాలేస్తోంది. ఇంత సిన్న విసయానికి పదివేలిత్తారాని .

విందూ : ఇస్తా సింహచెలం –నిజంగా ఇస్తా –కాని నీకు సమ్మతమేనాని.

సింహా : ఇంకా అడుగుతారేంటి బాబూ – పదివేలంటే మాటలా. చిరంజీవి బాబూ ఎలా పోతే నాకేంటి. నా బ్రతుకునాది. ఆర్ని గురించి నాకేటి బాధ....

విందూ : గుడ్ – సింహాచెలం. అదే మాటపై వుండు. ఆ జీవిగాడు రాగానే వాడి మనస్సు విరిచేసి ,ఇద్దరు చెరో వైపుకి పోదాం సరేనా.

సింహా : అలాగే బాబూ... మీరంటే గొప్పగురండి – మా చెడ్డ గౌరవండి.

విందూ : సరి సరి..అదిగో జీవిగాడొస్తున్నట్లుంది... నువ్వు లోపలికెళ్ళు. మిగతాపని నాకొదిలెయ్యి.

( సింహాచెలం వెళ్ళిపోయేడు. జీవి తన్మయత్వంతో స్టేజీపై కొచ్చేడు )

విందూ : వచ్చేవా జీవి – ఇంద కాఫీ తీసుకో !

( కప్పుని జీవి చేతికందించాడు. ఆపైన తను సిగరెట్ వెలిగించుకుని మిత్రుడి దృష్టి

కాఫీ కప్పుపై లేదని గమనించి – భుజంపై చెయ్యి వేసి ) ముందు కాఫీతాగు చల్లారిపోతుంది.

జీవి : కాఫీ కోర్కెలాంటిది – మొదట వేడిగా వుండి –క్రమ క్రమంగా చల్లారి పోతుంది. కాని ప్రేమ అలాకాదు. ఎప్పటికి పచ్చగా, వెచ్చగా ఉంటుంది. అన్నట్లు. ఒరే విందూ నీకో విచిత్రం చెప్పనా ?

విందూ : ఏవిటది ?

జీవి : వాణీ తండ్రి – రాత్రి ఢిల్లీ నుంచి కేవలం కూతురి పుట్టినరోజుకని వచ్చాట్ట. వస్తూ వస్తూ అయిదువేలు ఖరీదు చేసే పట్టుచీరే తెచ్చాట్ట.

విందూ : ఇదేనా విచిత్రం ?

జీవి : కాదు – వాణీ ఆ చీరెని ఏం చేసిందో తెల్సా ?

విందూ : అంత ఖరీదైన చీరెని తృణ ప్రాయంగా విసిరేసి ఇప్పుడు నువ్విచ్చిన ఆ నేత చీరెని ఆప్యాయంగా స్వీకరించింది అవునా ?

జీవి : ఈ విషయం నీకెలా తెల్సు ?

విందు : ఈ విషయమే కాదు. ఇంకా చాలా విషయాలు తెల్సు – కాని నీకేం తెలీవు – అదే నా బాధ

జీవి : విందూ ఏవిట్రా నువ్వనేది...

విందూ : నిన్న రాత్రి వాణికీ తనతండ్రి లక్ష్మీపతికి నిన్ను ప్రేమిస్తున్నట్లుగా చెప్పి నిన్ను తప్ప ఇంకెవర్నీ పెళ్ళాడబోవటం లేదని, బలవంతాన వేరే ప్రయత్నాలు చేస్తే తన శవం కళ్ళ చూడాల్సి వుంటుందని ధైర్యంగా చెప్పింది. అది విన్న ఆమె తండ్రి మొదట కోపగించుకున్నాడు. ఆ పైన అసహ్యించుకున్నాడు. చివరికి బెదిరించాడు. వుహూ వాణీ వినలేదు. చివరికి కూతుర్నేం చెయ్యలేక కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు యాయ్ ఐ కరెక్ట్ ?

జీవి : ( ఆశ్చర్యంగా ) ఈ సంగతులన్నీ నీకెలా తెల్సు ?

విందు : జీవి – చెప్పాగా ప్రేమనేది మత్తు పదార్థం లాంటిది. మనిషిని వాస్తవికతనించి దూరంగా తీసికెళ్ళి కృత్రిమ ప్రపంచంలో కూలేస్తుంది.

జీవి : నీకేం అర్థం కావటంలేదురా – సరిగ్గా చెప్పు, ఈ విషయాలన్ని నీకెలా తెల్సు ?

విందు : కాస్త బుర్ర పెట్టి ఆలోచించు. నీకే అర్ధమౌతుంది. నీ వాణియే స్వయంగా చెప్పింది ?

జీవి : ( ఆశ్చర్యంగా ) ఏవిటి .....ఏవిటి ....వాణీ చెప్పిందా - ఎప్పుడు చెప్పింది ?!!

విందు : వారం రోజుల క్రితం. రాబోయే తన పుట్టింరోజునాడు తను ఎలా ప్రవర్తించబోతోందో వారం క్రితమే చెప్పింది. సరిగ్గా అలానే చేసింది.

జీవి : ఏవిటి వాణీ చెప్పిందా..అంటే ....అంటే వాణీ నీకు తెల్సన్నమ్మాట.

విందు : జీవి - అలా కూర్చో ! నీకు కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పాలి ఇన్నాళ్ళు నిజాల్చెప్పి నిన్ను బాధపెట్టడం ఇష్టంలేక వుపేక్షించాను. కాని ఇపుడు చెప్పకపోతే స్నేహితుడికి ద్రోహం చేసిన వాడ్నవుతాను.

జీవి : విందూ నాకంతా అయోమయంగా వుందిరా. ఏవిట్రా నువ్వనేది. వాణీ తెల్సునంటున్నావ్ - తెలిస్తే ఇన్నాళ్ళు ఆ విషయాన్ని ఎందుకు దాచావ్. ఇప్పుడెందుకు చెప్పాలనుకుంటున్నావ్ ? - చెప్పరా చెప్పు.

విందూ : నీ శ్రేయోభిలాషిగా, మంచి స్నేహితుడిగా ఒక సలహా ఇస్తా పాటిస్తావా ?

జీవి : ఏవిటది ?

విందు : వాణీని మర్చిపోరా జీవి.

జీవి : ( ఆవేశంగా ) విందూ ( అంటూ అరిచేడు )

విందూ : ఆవేశం కాదురా కావాల్సింది ఆలోచన - నే చెప్పేది నీ మంచికోసమే

జీవి : నాన్‌సెన్స్ - నాక్కావలసింది నీతి పాఠాలు కావు. నిజాలు, పచ్చి నిజాలు నా వాణీని నేనెందుకు మర్చిపోవాల్రా - చెప్పరా చెప్పు ! ( ఆవేశంతో గోవిందు చొక్కా పుచ్చుకుని గుంజుతున్నాడు )

సింహా : బాబూ .....( అప్పుడే స్టేజీపై కొచ్చిన సింహాచెలం నోరు విప్పబోయి ఏదో గుర్తుకొచ్చి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. సరిగ్గా అదే సమయానికి టేబిలుపైన బ్రీఫ్‌కేస్ అతడి కళ్ళబడింది . ఆలోచన తళుక్కుమంది. దాన్ని చేతిలోకి తీసుకుని మెల్లిమెల్లిగా బయటికి అడుగు వేస్తున్నాడు - దాన్ని చిరంజీవి, గోవిందు ఎవ్వరూ గమనించలేదు )

విందు : చెపుతారా , చెపుతా ! వాణీని మర్చిపోమ్మని ఎందుకంటున్నానో చెపుతా. నీ

వాణీతో నాకిదివరకే పరిచయం వుంది గనక.

జీవి : ఆ విషయం ఇందాకే చెప్పావ్.....అయినా నీతో పరిచయం వున్నంత మాత్రాన నే వాణీని మర్చిపోవాలా ?

విందు : కొద్ది పరిచయం అయితే మర్చిపోనక్కరలేదు. కాని వాణీతో నా పరిచయం మామూలుది కాదు.

జీవి : అంటే .....???

విందూ : ఎలా చెప్పాలో, ఎలా చెబితే నీ కర్థమవుతుందో తెలీటం లేదు ఇందాకా నేను పద్దెనిమిదిమంది ఆడకూతుళ్ళని ఆశీర్వదించానని చెప్పా గుర్తుందా !

జీవి : ఇప్పుడా విషయం దేనికి .

విందు : నీకు బాగా అర్ధమయ్యేందుకు. ఆ పద్దెనిమది ఆడకూతుళ్ళల్లో నీ వాణీ గూడా వుంది రా.

జీవి : విందూ ( పెద్దగా అరిచేడు )

విందూ : నాకు తెల్సు – నాకు తెల్సు – ఈ మాట వింటే నీ గుండె బ్రద్దలైపోతుందని – కానీ చెప్పక తప్పలేదు. స్నేహధర్మం, వుదయం నీ చేతిలో ఫోటో చూసిన క్షణం నించి నాలో నేనే మధన పడిపోతున్నాను – చెప్పాలా – వద్దాని, కాని చివరకి.....

జీవి : నో – నేన్నమ్మను – వాణీ అలాంటిది కాదు – నా వాణి అలాంటిది కాదు. వాణీ దేవత – నిప్పుకన్నా , నిజం కన్నా , నీళ్ళకన్నా పవిత్రురాలు.

విందు : ( జీవి భుజంపై చెయ్యివేసి ) సరేరా అలాగే అనుకో. స్నేహితుడిగా నా ధర్మాన్ని నే పాటించాను...నా మనస్సు హాయిగా వుంది. నమ్మటం, నమ్మలేకపోవటం ఇహ నీ ఇష్టం ( అంటూ వెళ్ళిపోబోయేడు )

జీవి : ( అతడిని పట్టి ఆపి ) ఆగు – నా మనస్సులో ఈ అనుమానబీజాన్ని నాటి నేనేడుస్తుంటే, బాధపడుతుంటే, చూసి ఆనందించాలనా నీ వుద్దేశ్యం ?

విందూ : అబద్దాన్ని అరక్షణంలో చెప్పి నమ్మించదవచ్చు. కాని నిజాల్ని చెప్పి నమ్మించాలంటే చాలా కష్టం.

జీవి : అంటే ఇప్పుడు నువ్ కూసిందంతా నిజమేనంటావ్ .

విందూ : ఇంతవరకు వచ్చాక ఇంకా దాపరికం దేనికి చెప్పేస్తా. అంతా చెప్పేస్తా వాణీతో నాకు గత ఏడాదిగా పరిచయం వుంది. సినిమాతో మొదలైన మా పరిచయం

ఇంకొంచెం ముందుకెళ్ళి ఏకాంతంగా గడిపేవరకూ వెళ్ళింది. ఎన్నో పగళ్ళు పరాయి గదుల్లో.... సారీ... ఇప్పుడవన్నీ అనవసరం. చివరగా వారం క్రితం కల్సింది ఎవరో ఓ కుర్రాడు తనని ప్రేమిస్తున్నానని, వెంటపడుతున్నాడని చెప్పింది. ఆ కుర్రాడివి నువ్వేనని ఊహించలేకపోయాను.

జీవి : ( కోపంగా ) ఇంకేం చెప్పింది.

విందూ : ఆ కుర్రాడ్ని- అంటే నిన్ను పెళ్ళి చేసుకుంటానని – అయినా అప్పుడప్పుడు మనం కల్సుకోవాలనీ అంది. నువ్వని తెలీక అలాగే అన్నాను. రాబోయే తన పుట్టినరోజునాడు ఈ విషయాన్ని తండ్రికి ఏ విధంగా చెప్పదల్చుకుందీ, ఎలా గొడవ చెయ్యదల్చుకుంది. పట్టు చీరెని కాదని ముతక చీరెని ఎలా స్వీకరించేది – అన్నీ చెప్పింది. సరిగ్గా అలాగే చేసింది. కాకపోతే గడప దాటని నాకు వాణీ ఇంట్లో ఇంట్లో సంగతులెట్లా తెలుస్తాయ్ – ఆలోచించు.

జీవి : అవును అదీ నిజమే ఇవన్నీ నీకెట్లా తెలుస్తాయ్ ? అంటే .....అంటే....

విందు : ( అనునయంగా ) ఇంకా సందేహమా – అయినా జీవి ఒక్క ఆడదాన్ని గూర్చి ఇంతగా నువు బాధపడటం మంచి లక్షణం కాదు. ఆడదాని నైజమే అంత మగాడ్ని మర బొమ్మని చేసి ఆడిస్తుంది. ఛ.... వూరుకో బాధపడకు.

జీవి : ( ఏడుస్తూ ) ఒరే విందు, వాణీకి నా ప్రాణం ఇచ్చేరా. నా జీవితానికి దిక్సూచని, వూపిరని, వెలుగని నమ్మేరా.

విందు : అదే నువ్వు చేసిన తప్పు గుడ్డిగా ఎప్పుడు ఏ ఆడదాన్ని నమ్మకూడదు. ఇప్పటికైనా మించిపోయిందేం లేదు. జరిగిందంతా ఓ పీడకలని మర్చిపో..

జీవి : అది నా వల్ల కాని పని.

విందూ : అంటే ఏం చేస్తావ్....ఇంకా ప్రేమిస్తావా....

జీవి : కాదు... దెబ్బకి దెబ్బతీస్తా, నన్నింత దగా చేసి ద్రోహం చెయ్యాలని చూసిన ఆ పంచకికి, తగిన పాఠం చెబుతా.

విందు : అంటే ......అంటే....

జీవి : ఇప్పుడే వెళ్ళి నీ నిజరూపం తెల్సిందని చెప్పి ఇంకెవ్వరి జీవితాల్తోనూ ఆడుకోవద్దని చెప్పొస్తా.

విందు : వుపయోగం వుండదు. ఏ ఆడది తన తప్పుని ఒప్పుకోదు. తను చాలా పవిత్రురాలనంటుంది. అసలు గోవిందెవడో నాకు తెలీదని బుకాయిస్తుంది. ఘొల్లు ఘొల్లుమని కాళ్ళ మీదపడి ఏడస్తుంది.

జీవి : విందూ – ఎవడైనా ఒకసారే మోసపోతాడు. కన్నీళ్ళకి కల్లబొల్లి కబుర్లకి తరచూ మోసపోడు.

విందూ : జీవి – నా మాట విను....వెళ్ళొద్దు...ప్లీజ్

జీవి : మండిపోతున్నది నా గుండె నీది కాదు. మైండిట్

( అంటూ విసురుగా వెళ్ళిపోయేడు )

( విందు అతడెళ్ళిన వైపుగా కొద్ది క్షణాలు చూసేడు – ఆ పైన సన్నగా నవ్వుకుని తనలో తను అనుకుంటున్నాడు )

విందు : అంతా అనుకున్నట్లే అయింది –జీవిగాడి ప్రేమకావ్యం పూర్తయింది. ఇపుడు వీడెళ్ళి వాణీని ఆవేశంలో, కోపంలో, నానామాటలు అంటాడు. ఆ పిల్ల నాకేం తెలీదు మొర్రోని కాళ్ళా, వ్రేళ్ళ పడుతుంది. కాని వీడు నమ్మడు. నోటి కొచ్చినట్టల్లా తిట్టి ఇక నీ మొహం నాకు చూపించొద్దని చెప్పి ఛాక్క వచ్చేస్తాడు. లక్ష్మీపతి ఈ సంగతి విని ఆనందిస్తాడు. సృష్టిలో తియ్యనిది ప్రేమని నమ్మి మోసపోయాడు ఫ్రెండ్ – కాని సృష్టిలో తీయనది డబ్బని నమ్మిన నాకు దక్కింది లక్ష.

( అంటూ నవ్వి చటుక్కున ఏదో గుర్తుకొచ్చినట్లు బ్రీఫ్‌కోసం టేబిలుపైన చూసి అక్కడి అది కనిపించకపోయేసరికి ఆదుర్దాగా వెతుకుతున్నాడు )

సింహాచలం – సింహాచలం

( అంటూ పిల్చి బదులు రాకపోయేసరికి లోపలికెళ్ళి వెంటనే బయటికొచ్చి )

రాస్కెల్ – కొంపముంచేడు సింహాచలం డబ్బుచ్చుకు పారిపోయేడు – ఇప్పుడేవిటి చెయ్యటం ?

( అనుకుంటూ అటూ ఇటూ అసహనంగా పచార్లు చేస్తుండగా సింహాచెలం తాపీగా వచ్చి నిల్చున్నాడు. నోట్లో సిగరెట్టు విలాసంగా తాగుతున్నాడు )

విందూ : ( ఆదుర్దాగా ) సింహాచెలం ఇక్కడ.... ఇక్కడ బ్రీఫ్‌కేసుండాలి చూసేవా.

సింహా : చూసేనండి ( తాపీగా )

విందూ : దాంట్లో ....దాంట్లో ....

సింహా : లక్ష రూపాయలున్నాయండి. అదీ చూసేను.

విందూ : చూసేవా. హమ్మయ్య బ్రతికించావ్. ఎవడో కొట్టేశాడని భయపడి చూస్తున్నాను. భద్రం చేసేవ్ గదా ?

సింహా : చేసేనండి.

విందూ : ఎక్కడ దాచేవ్.

సింహా : అది మాత్రం అడక్కండి, అడిగినా చెప్పను.

విందు : అంటే .....అంటే ....మొత్తానికి మొత్తం.,....

సింహా : సృష్టిలో తియ్యనిది డబ్బని మీరే గదండి చెప్పారు. అంచేత సొంతం చేసుకున్నానండి.

విందూ : అన్యాయం, అక్రమం ,దగా ,అది నా డబ్బు

సింహా : మీదా – ఎక్కడిదండీ !

విందూ : నే కష్టపడి సంపాదించుకున్నది. మర్యాదగా ఎక్కడ దాచావో చెప్పు లేకపోతే ....లేకపోతే నిన్ను ప్రాణాల్తో వదల్ను.

సింహా : ( నవ్వి ) ఏవిటి ప్రాణాల్తో వదల్రా– అంటే చంపేస్తారా బాబూ చంపెయ్యండి, కాని నాతో పాటు ఆ డబ్బుకి గూడా ప్రాణం పోతుంది. నాకు తప్ప ఇంకెవ్వరికి తెలీని ప్రదేశంలో దాచేను. చంపెయ్యండి.

విందూ : ( కాస్త తగ్గి, బ్రతిమాలుతున్నట్లుగా ) సింహాచెలం ఇది నీకు న్యాయం కాదు, బీదవాడివని, చదువు సంధ్య లేనివాడివని, ఇలా నౌకరులా బ్రతకలేవని పదివేలు గూడా ఇస్తానన్నానే– ఆ మాత్రం అభిమానం గూడా లేకుండా ....

సింహా : ఆపండాపండి....ఏవిటన్నారు – చదువు సంధ్యలేని వాడ్నా – బాబూ నేనూ ఇంటర్ పాసయ్యి రాత్రి కాలేజీలో డిగ్రీ చదువుతున్నానండి

విందూ : నిజంగానా ?

సింహా : ఇంకేంటన్నారు. బీదవాడినని కదూ – అవునండి నే బీద వాడినే – బీదరికం నేరం కాదండి – కాని నేరాలు చేస్తేనే గాని ఈ దేశంలో మనుషులు గొప్పోళ్ళు అవరండి ఇంకేంటన్నారు ?

విందూ : అది కాదు సింహాచెలం.

సింహా : షటప్ – ఇంకేంటన్నారు. నౌకర్నని కదూ – పక్కోడి ప్రేమని ప్రాణాల్ని అమ్మేసి సొమ్ము చేసుకోవటం కంటే, నౌకరుగా నిజాయితీగా బ్రతకటమే నాకిష్టమండి.

విందూ : నిజాయితీ – ( నవ్వి ) లక్ష రూపాయల్ని అక్రమంగా తీసికెళ్ళిపోయి ఇపుడు నీతి నిజాయితీల గురించి కబుర్లు చెపుతున్నావా సింహాచెలం !

సింహా : ఆ డబ్బు పాపిష్టిది గదండి – అంచేత నాకు పాపం అంటుకోదండి ఆ లక్ష్మీపతి క్రిందోళ్ళ కడుపుకొట్టి సంపాయించి వుంటాడు. ఆడి నోరు కొట్టి మీరు సొంతం చేసకున్నారు. మిమ్మల్ని కొట్టి నేనుచ్చుకున్నాను. పాపిష్టి సొమ్ము ఎప్పుడు పదిచేతులు మారుతుందండీ ....కష్టపడిన సొమ్ము కదలకుండా వుండి పోతుందండి....

విందూ : సింహాచెలం – నువ్వు చెప్పింది నిజమే. అది పాపిష్టి సొమ్మే అంచేత ఇద్దరం సమానంగా పంచుకుందా. నీకు యాభై వేలిస్తాను. ఎక్కడ దాచావో చెప్పు.

సింహా : ఏవిటి బాబూ – రేటు పేంచేసారు.అయినా మోసం చెయ్యాలనే నాకుంటే మళ్ళీ మీ ముందుకు వచ్చుండే వాడ్నే కాదు గదండి....నా కొద్దండి ఆ డబ్బు....

విందూ : అంటే ....అంటే ....నీకేం వాటా అక్కర్లేదా.

సింహా : వద్దండి, మొత్తంగా మీరే వుంచుకోండి.

విందూ : థాంక్స్ సింహాచెలం – నీలాంటి వాళ్ళు ఇంకా వుండబట్టే వర్షాలు కురిసి పంటలు పండుతున్నాయ్

సింహా : ఆపండాపండి – మీలాంటోళ్ళుండ బట్టే కష్టపడ్డోడికి కూడులేకుండా పోతుంది. ఆ డబ్బు ఎక్కడ దాచానో చెప్పేస్తా.

విందూ : చెప్పు సింహాచెలం త్వరగా చెప్పు – ఎక్కడ దాచావ్.

సింహా : కాని నాదో షరతండి.

విందూ : ఏవిటది .

సింహా : ఇప్పుడా చిరంజీవి ఎక్కడి కెళ్ళారండి.

విందూ : ( ఆలోచించే ) – ఏమో తెలీదు బహుశా అలా బజార్ల వెంట తిరిగి రావటానికయ్యుంటుంది. దేనికి ?

సింహా : ఆయన రాగానే జరిగిందంతా చెప్పి ఆరికాళ్ళ మీద పడి క్షమాపణ చెప్పుకోవాలి.

విందూ : ఎవరు ?

సింహా : ఇంకెవరు ? మీరే–అప్పుడు గాని ఆడబ్బు ఎక్కడ దాచిందీ చెప్పనండీ ?

విందూ : ( ఆలోచించి ) కాని ఒక్క విషయం సింహాచలం – క్షమాపణ ఆడగటానికి నాకేం అభ్యంతరం లేదు – కాని జీవి తిరిగి వాణీతో ప్రేమ కొనసాగిస్తే లక్ష్మీపతి వాడ్ని చంపేస్తాడు. లక్ష రూపాయలిచ్చిన వాడు చేతులు కట్టుక్కూర్చోడు – కాదంటావా ?

సింహా : ( కాస్సేపు ఆలోచించి ) అది నిజమేననుకోండి కాని నాక్కావలిసింది చిరంజీవి మొఖంలో సంతోషమండి. వారి ప్రేమ. ఇంకా పదిలంగా, పచ్చగా , పవిత్రంగా వుందని తెలియచెప్పాలండి, అదే నా ధేయమండి, నేనూ ఒక పిల్లని ప్రేమించానండి. కాని నా కన్నా చదువుకండి. మా వూళ్ళోనే టీచర్‌గా పన్చేస్తుందండి, నా డిగ్రీ అయ్యేక వుద్యోగం దొరికాక పెళ్ళి చేసుకోవాలనుకున్నాం . ప్రతి నెలా తన జీతంలోంచి నాకుడబ్బు పంపిస్తుంది. పగలంతా ఖాళీగా వుండటం ఇష్టంలేక ఏ ఉద్యోగమూ దొరక్క ఇలా నౌకర్ల పన్చేస్తున్నానండి.

విందూ : అంటే అప్పాయమ్మ .....కోడికూర ....రొయ్యలపులుసూ....

సింహా : అంతా వొట్టిది –పిట్ట – పిట్టకథ చెప్పానంతే. ఇప్పుడు చెప్పండి – చిరంజీవికి క్షమాపణ చెప్పనంటారా – లేక నన్నే చెప్పెయ్యమంటారా. నే చెబితే ఆ డబ్బు మీకు రాదండి. అదిగో చిరంజీవి రానే వస్తున్నారు

( చిరంజీవి వచ్చేడు – సరాసరి కుర్చీవద్దకెళ్ళి కూర్చుని బల్లపై తల వాల్చి పడుకుండిపోయేడు. గోవిందు స్టేజిముందుకొచ్చి ఆలోచిస్తూండగా, సింహాచెలం జీవి వద్దకెళ్ళి )

సింహా : ఏంటి బాబు ? అలాగున్నారు ;

జీవి : అంతా అయిపోయింది సింమాచెలం. ఇప్పుడు బతుకంతా శ్మశానం భవిష్యత్తంతా బూడిద.

సింహా : ఏవిటి బాబూ, అలా బెంబేలు పడిపోతారు. ఇపుడేమైందని.

జీవి : ఇంకేం కావాలి సింహాచెలం, అసలు అవటానికేం ఉందని మసిచ్చింది – మభ్యపెట్టి మోసం చేసేక ....

సింహా : మిమ్మల్నెవరూ మోసం చెయ్యలేదు బాబూ నామాట నమ్మండి.

జీవి : సింహాచెలం ఏవిటి నువ్వంటున్నది.

( సింహాచెలం అక్కడ్నించి కదిలి గోవిందు వద్దకొచ్చి )

సింహా : ఇప్పటికైనా  నిజం చెప్పెయ్యండి. లక్షరూపాయలకోసం  కాకపోయినా లక్షణమైనా మనిషిగా పుట్టినందుకైనా నిజం చెప్పి  పుణ్యం కట్టుకోండి

జీవి : సింహాచెలం – ఏం నిజం – విందూ లక్షరూపాయలేవిటి ? ఏవిట్రా వీడంటున్నది.

విందూ : నన్ను క్షమించరా  జీవి – ఇందాక  నీతో చెప్పిన సంగతులన్నీ కల్పితాల్రా – అబద్దాలు.

జీవి :  అంటే ....వాణీతో  పరిచయం.

విందూ : అవును. అసలు వాణీ ఎవరో నాకు తెలీదు. ఆమెతో నాకు పరిచయం అస్సల్లేదు – నిజం.

జీవి : ( పేలవంగా నవ్వి ) నాకు తెల్సురా ఎందుకిలా మాటమార్చేవో ! నే బాధపడుతుంటే చూడలేక కదూ – నీలాంటి ఫ్రెండ్ దొరకటం నా అదృష్టంరా.

సింహా : మీరెంత అమాయకులండి. ఇందాక  అబద్దం చెబితే ఇట్టే నమ్మేశారు. ఇపుడు నిజం చెబుతుంటే నమ్మనంటారు – ( విందుతో ) చెప్పెయ్యండి మొత్తం జరిగిందంతా చెప్పెయ్యండి

( మాటలు వినిపించటం లేదు కేవలం పెదాల కదలిక కనిపిస్తోంది )

విందు తలొంచుకుని  ఏదో  చెపుతున్నాడు. మధ్య మధ్యలో  సింహాచెలం  గూడా మాటలందిస్తున్నాడు. ఒక్కొక్క మాటవింటూ జీవి గుండెలు పట్టుకుని కూర్చుండి పోతున్నాడు, జుట్టు పీక్కుంటున్నాడు –కాస్సేపటికి)

సింహా : అదండి జరిగింది – తెల్సిందా అంటే మీ  వాణి పవిత్రురాలు మీ ప్రేమ పవిత్రం. ఇదంతా మీరు ఫ్రెండని నమ్మిన  వీరు ఆడిన  నాటకం.

జీవి : ఎంత పన్చేసావ్ – ఎంత ఘోరం జరిగింది.

సింహా : బాబూ  –జరిగిందేదో  జరిగింది – మర్చిపోండి ....మీరెంత అదృష్టవంతులు ....అందువల్లే ఏ ఘోరం జరక్కుండా నాటకం బయటపడింది.

జీవి : కాదు సింహాచెలం జరిగిపోయింది. జరక్కూడని ఘోరం  జరిగిపోయింది. వీడి మాటలు నమ్మి నా వాణీని నానా మాటలు అని వచ్చేశాను.

సింహా : నిజంగానా .... ఎంత పన్చేసారు బాబూ.

విందూ : నన్ను క్షమించరా జీవి – ప్లీజ్

జీవి : అయ్యో - ఎన్నెన్ని మాటలన్నాను - ఎంత అసహ్యంగా మాట్లాడేను. నాకేం తెలీదని, కావాలంటే నిప్పులో దూకుతానని మొరపెట్టుకుంది. నువ్వే నాకు దేవుడంది. నీ మొహం నాకు చూపించొద్దని అవమాన పరిచి మరీ వచ్చేను. వాణి - నన్ను క్షమించు.

సింహా : బాధపడకండి - ఇవన్నీ ప్రేమకి పరీక్షలు - వీటన్నింటిని దాటినప్పుడే ఆ ప్రేమ గట్టిపడీ పదికాలాలు నిలుస్తుంది - పదండి బాబు- వెంటనే వెళ్ళి ఆ పిల్లకి క్షమాపణ చెప్పుకుందాం . పదండి.

జీవి : నే రాలేను సింహాచెలం నా వొంట్లో ఇప్పుడు నెత్తురులేదు నీళ్ళు మురికీ నీళ్ళు - నా నరనరాల్లో ప్రవహిస్తున్నాయ్. నే వాణిని చూడలేను. క్షమించమని అడుగనే లేను. అది నా వల్ల కానిపని.

సింహా : సరే బాబు. నేవెళ్ళి మీ వాణిని తీసుకొస్తాను. ఇక్కడే, ఇప్పుడే అందరిముందు నిజాన్ని చెప్పి ఆ తల్లి కాళ్ళమీదపడి క్షమాపణ అడుగుదాం. నే వెళ్ళొస్తా బాబూ.

విందూ : సింహాచెలం ? ( ఆదుర్దాగా )

సింహా : ఏం బాబూ, లక్షరూపాయలు గురించా - ఇళ్ళు తగలెట్టి కర్రముక్కలేరుకునే గొప్పోళ్ళు నమస్కారం బాబూ, మీ డబ్బు కూడా తెస్తా ఇక్కడే ఉండండి.

( సింహాచెలం వెళ్ళిపోయేడు. జీవి ఏడుస్తున్నాడు.విందూ పచార్లు చేస్తున్నాడు. స్టేజీపైన లైటు యాంగిల్ మారింది )

( లైట్స్ ఆఫ్ & ఆన్ )

( సింహాచెలం సరాసరి వచ్చి ఒకసారి జీవివంక చూసి అక్కడ్నించి విందు వద్దకెళ్ళి - బ్రీఫ్‌కేసు అందించాడు

సింహా : ఇదిగో బాబూ - డబ్బూ - లక్షరూపాయలు మీరు కష్టపడి సంపాయించుకున్నది. ఒక ప్రాణం ఖరీదు, ఇంకో జీవితం ఖరీదు - వెరసి లక్ష –చాలా చవగ్గా అమ్మేసారు. ఇంకా రేటు పలికేదేమో. ఇక నించి ప్రాణాలని, జీవితాలని , ప్రేమలని వేరు వేరు చేసి అమ్మండి. ఇంకా ఎక్కువ డబ్బొస్తుంది. చూసుకోండి బాబూ సరిగ్గా వుందో లేదో ?

( గోవిందు పెట్టె తెరచి చూసుకుంటున్నాడు. జీవి పరిగెత్తుకుంటూ వచ్చి )

జీవి : సింహాచలం  – వాణీ వచ్చిందా ఏదీ – వాకిట్లో నిల్పోబెట్టిగాని వచ్చేవా

( అనుకుంటూ బయటికి వెళ్ళబోయాడు )

సింహా : రాలేదు బాబూ

జీవి : రాలేదా ఎందుని – రానందా, అవును, ఎలా వస్తుంది ? ఎంత ప్రేమించినా వాణీ కూడా మనిషేగా, తనకీ అభిమానం , రోషం వుంటాయిగా, అంత అసహ్యంగా మాట్లాడిన నన్ను చూట్టానికి ఎలా వస్తూంది – రాదు – రానంటుంది.

సింహా : లేదు బాబూ, అలా అనలేదు.

జీవి : అంటే నన్ను రమ్మనమందా, అవును అదే న్యాయం నేనే స్వయంగా వెళ్ళి వాణీకి క్షమాపణ చెప్పుకోవాలి – ( వెళ్ళబోయేడు )

సింహా : మిమ్మల్ని రమ్మని గూడా అనలేదు బాబూ

జీవి : అంటే అస్సలు నువు వెళ్ళలేదా ? వాణి ఏవంది ? త్వరగా చెప్పు సింహాచెలం !

సింహా : ఏవంటుంది బాబూ. ఏ ఆడదైనా తొలిసారి. ఒకడ్ని ప్రేమించి తన సర్వస్వం అతడే అనుకుని ఆరాదిస్తుంటే, ఆ వ్యక్తి అసహ్యంగా మాట్లాడి, అవమాన పరిస్తే, ఏం చేస్తుంది. ఆనాడు సీతమ్మ నిప్పులో దూకింది. ఈనాడు వాణెమ్మ వురేసుకుంది

( జీవి ఫ్రీజయ్యాడు )

విందూ : సింహాచెలం ఏవిటి నువ్వంటున్నది నిజమా ? ( ఆశ్చర్యంగా )

సింహా : పచ్చినిజం – లక్ష రూపాయలంత నిజం – ప్రేమనే పదాన్ని పవిత్రం చేసే నిజం. చిరంజీవిబాబు ఇటు రాగానే ఆ తల్లి తన గదిలో ఫ్యాన్‌కి వురేసుకుని చనిపోయింది.

జీవి : సింహాచెలం ( బిగ్గరగా అరిచాడు )

( గోవిందు చేతిలోని పెట్టెజారి క్రిందపడింది. తెల్లబోయి చూస్తున్నాడు )

సింహా : అరిచి ప్రయోజనం లేదండి – అంతా అయిపోయింది – మీకన్నా నాకన్నా అందరికన్నా నిజాయితీగల పిల్లండి. బాబూ – పోయేటప్పుడు గూడా నిజాయితీని వొదులుకోలేదంట. వాళ్ళ నాన్న తెచ్చిన పట్టుచీరెతో కాదు బాబూ వురేసుకుంది. మీరిచ్చిన ముతక చీరెతోనే అది బాబు నమ్మకమంటే – అదీ ప్రేమంటే

జీవి : వాణీ...వాణి .....( ఏడుస్తూ విందుతో ) ఇదంతా నీ వల్లే, నువ్వే ఈ ఘాతుకానికి కారకుడివి. నువ్వే....నువ్వే....నువ్వే

( అంటూ గుండెలపైన బాదుతున్నాడు )

సింహా : కారణం ఎవ్వరైనా కాల రాచింది ఓ ఆడపిల్ల బ్రతుకు. వెళ్ళండి బాబు. త్వరగా వెళ్ళండి– దేవతలాంటి ఆ తల్లికి దండం పెట్టుకురండి – కలిసి ఏడడుగులు వెయ్యలేకపోయినా, పాడితోపాటు పదడుగులు వేసిరండి వెళ్ళండి – త్వరగా – ఆలస్యమైతే ఆ అదృష్టం గూడా కరవవుతుంది.

( వాణి, వాణి అంటు ఏడుస్తూ జీవి బయల్దేరాడు – గోవిందు క్రింద పడ్డ బ్రీఫ్‌ని అక్కడే వదిలి, అతడితో పాటుగా వెళ్ళబోయేడు )

సింహా : బాబూ, డబ్బు ఇక్కడే మర్చిపోయేరు ( అంటూ పెట్టెని అందించాడు )

విందూ : వద్దు, సింహాచెలం – నాకొద్దు ఇన్నేళ్ళు డబ్బుని మించిన తీపి వస్తువు సృష్టిలో లేదనుకున్నా, కాని ఇప్పుడే తెల్సింది. సృష్టిలో తియ్యనిది ప్రేమ – సింహాచెలం – ఖచ్చితంగా ప్రేమే. ఆ డబ్బు నాకొద్దు ఏం చేస్తావో నీ ఇష్టం.

( అనేసి జీవితో పాటుగా వెళ్ళిపోయేడు )

( సింహాచెలం స్టేజీ మధ్యగా నిల్చుని చేతిలోని బ్రీఫ్‌వంక కాస్సేపు చూసి )

సింమా : డబ్బు పాపిష్టిది – కొద్దిగా ఉంటే ప్రాణాలు నిల్పుతోంది – ఎక్కువైతే ప్రాణాలు తీస్తుంది – మనిషి కనిపెట్టిన మారణాయుధం

( అని బ్రీఫ్‌ని టేబిలుపై వుంచి అక్కడున్న డైరీని చేతిలోకి తీసికొని కాస్త ముందుకొచ్చి )

ఇపుడు విచిత్రంగా గోవిందుపైన నా క్కోపం లేదు. ఎందుకనో తెలీదు. కాని చిరంజీవి పైన గొప్ప కోపంగా వుంది. పిరికివాళ్ళకి, అనుమానస్తులకి ప్రేమించే హక్కు లేదు. ఆ అనుమానం వల్లనే ఒక ఘోరం జరిగిపోయింది. వాణీ అక్కడ చనిపోయినా ( డైరీని చూపిస్తూ ) ఇక్కడ బ్రతికేవుంది. కాని ఈ మాత్రం అదృష్టం కూడా ఆ పిరికి వాడికి దక్కటం నాకిష్టం లేదు. అంచేత అక్కడ ఆమె శవం దహనం జరిగేప్పుడే ఇక్కడ మిగిలిపోయిన ఈ అవశేషం గూడా దహనం అయిపోవాలి. అప్పటికి గాని ప్రేమకి న్యాయం, చిరంజీవికి శిక్ష పూర్తి కావు.

( అంటూ మోకాళ్ళపై కూర్చుని అగ్గిపుల్లని వెలిగించి, ఆ మంట వద్దకి డైరీని మెల్ల మెల్లగా తెస్తుండగా )